సేవకులే బాధితులైన వేళ..!

- పనిభారం పెంచేస్తున్న ప్రభుత్వం
- హక్కుల పరిరక్షణ మాత్రం శూన్యం
- కూటమి నేతల ఒత్తిడిలో ఉద్యోగులు



మోదుకూరులోని సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు



పినపళ్లలో ప్రభుత్వ బ్రోచర్లను పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు (ఫైల్)

ఆలమూరు: గ్రామ స్వరాజ్య స్థాపన కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రస్తుతం నిర్వీర్యం దిశగా సాగుతోంది. ప్రజల ముంగిటకే సేవలను అందించిన సచివాలయ ఉద్యోగులు ప్రస్తుతం కూటమి నేతల ఒత్తిడికి గురవుతున్నారు. దైనందిన విధులకు తోడు అనవసర యాప్‌లతో ప్రభుత్వం పని భారాన్ని పెంచుతోంది. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల పరిధిలో 236 గ్రామ సచివాలయాలు ఉండగా అందులో 1,782 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయ ఉద్యోగులందరినీ కేవలం ప్రజా ప్రయోజనాలు, సంక్షేమ పథకాల అమలుకు మాత్రమే కేటాయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటివరకూ ఉన్న వలంటీర్ల వ్యవస్థను తొలగించి ఆ భారమంతా గ్రామ సచివాలయ ఉద్యోగులపై మోపింది.

కక్ష సాధింపు వైఖరి సరికాదు

గ్రామ సచివాలయ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు వైఖరి సరికాదని ఆ సంఘ ఐక్యవేదిక ఆవేదన చెందుతోంది. ఇప్పటికే సామాజిక పింఛన్ల పంపిణీ, వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థ, పీ4, రేషన్ కార్డుల పంపిణీ తదితర బాధ్యతలను ఏకకాలంలో అప్పగించడం వల్ల గ్రామ సచివాలయాల్లో ప్రజలకు అందించే సేవలు కుంటుపడుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ పనులతో పాటు పార్టీ ప్రచారం కూడా సచివాలయ ఉద్యోగులకు అప్పగించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు చేయాల్సిన రేషన్ కార్డుల పంపిణీని కూడా సచివాలయ ఉద్యోగులకే అంటగట్టడంపై నిరసన వ్యక్తమవుతుంది. దీంతో పాటు ప్రభుత్వంలో ఏ శాఖకు సంబంధించిన పనైనా వారికే అప్పగించి, వారి పట్ల ప్రభుత్వం కక్ష సాధింపు వైఖరిని అవలంభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనిపై ప్రశ్నిస్తే మెమొలు ఇస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. దీర్ఘకాలికంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించకుండా ఏకపక్షంగా పని భారాన్ని పెంచుకుంటూ పోతే బాధ్యతలు నిర్వర్తించేది ఎలా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

సచివాలయ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆ సంఘ ఐక్యవేదిక చేస్తున్న డిమాండ్లివే..

- ఇంటింటికీ తిరిగి నిర్వహించే సర్వే పనులు పరిమితంగా చేయాలి.
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖకు అప్పగించాలి.
- సమయ పాలనలేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలి.
- కార్యాలయం పని వేళల్లో మాత్రమే వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించాలి.
- సెలవు దినాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు అప్పగించవద్దు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు

- నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి.
- 6ఏళ్ల పాటు ఒకే క్యాడర్‌లో పనిచేసినా స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలి.
- ఉద్యోగులను రికార్డు అసిస్టెంట్ నుంచి జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్చాలి.
- ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే విధంగా జాబితాను రూపొందించాలి.
- ఉద్యోగుల సీనియారిటీకి అనుగుణంగా పారదర్శక బదిలీలు నిర్వహించాలి.

క్లుప్తంగా

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రతతోనే సాధ్యమవుతుందని వైద్యాధికారి కె.ఎస్.శ్రీనివాస్ అన్నారు. గంగలకుర్రు ఇంటిగ్రేటెడ్ వసతి గృహంలో ఉన్న విద్యార్థులకు అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణంలో డెంగీ, చికున్ గున్యా, విష జ్వరాలు సోకే ప్రమాదం ఉన్నందున్న ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం చర్మ వ్యాధులతో పాటు ఇతర వ్యాధులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బి.అప్పారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర తైక్వాండో పోటీలకు సాయిదుర్గ



అంబాజీపేట: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు సాయిదుర్గ ఎంపికైనట్లు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో సాయిదుర్గను పలువురు శనివారం అభినందించారు. త్రిమూర్తులు మాట్లాడుతూ, ఈ నెల 12న కాకినాడలో జరిగిన తైక్వాండో స్కూల్ గేమ్స్ అండర్-19 విభాగంలో సెలక్షన్స్ జరిగాయన్నారు. ఈ సెలక్షన్స్‌లో సాయిదుర్గ 55 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. త్వరలో రైల్వే కోడూరులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనుందన్నారు. కోచ్‌లు పితాని భార్గవి, రామచంద్ర, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు సాయిదుర్గను అభినందించారు.


గుండెపోటుతో ఏఎన్ఎం మృతి

రాజోలు: గుండెపోటుతో చికిత్స పొందుతూ బి.సావరం గ్రామానికి చెందిన ఏఎన్ఎం సువర్ణ (32) మృతి చెందారు. తాటిపాక పీహెచ్‌సీలో ఎన్‌హెచ్ఆర్ఎం ఏఎన్ఎంగా సువర్ణ విధులు నిర్వహిస్తున్నారు. భార్య మృతితో భర్త చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుమార్తె కన్నీరు మున్నీరుగా విలపించారు. చిన్న వయసులో సువర్ణ మృతి చెందడం పట్ల తాటిపాక పీహెచ్‌సీ వైద్యాధికారి ఫణికిరణ్ విచారం వ్యక్తం చేశారు. డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాసరావు, రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, నాయకులు సరెళ్ల విజయ్‌ప్రసాద్, తెన్నేటి కిషోర్, కడియం పూర్ణచంద్రరావు, తాటిపాక పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు ఆమె భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.

అంబేడ్కర్ కలలను సాకారం చేయండి

మామిడికుదురు: గ్రామంలోని అంబేడ్కర్ సామాజిక భవనంలో శనివారం రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని 63 మంది విద్యార్థులకు రూ.1.50 లక్షల ప్రతిభా పురస్కారాలను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అందించారు. అంబేడ్కర్ కన్న కలలను సాకారం చేయాలని ఈ సందర్భంగా అన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహాలు, షీల్డులను అందజేశారు. రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం చేస్తున్న సేవలను ఎమ్మెల్యే అభినందించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఎంఈఓ కోన హెలీనా, సంఘం ప్రధాన కార్యదర్శి కారుపల్లి కళ్యాణ్‌బాబు, ఆర్థిక కార్యదర్శి నేల శ్రీనివాసరావు, రిటైర్డ్ ఎంఈఓ నీతిపూడి చంద్రరావు, భూపతి వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

స్వామి సన్నిధిలో భీమవరం ఏఎస్పీ



ఏఎస్పీకి స్వామి చిత్రపటం అందిస్తున్న ప్రసాద్

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వాసుపల్లి భీమారావు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం అర్చకులు ఆయనకు ఆశీర్వచనాలు పలికారు. స్వామివారి చిత్రపటాన్ని అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ అందజేశారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా జొన్నాడ, మూలస్థాన అగ్రహారం, మడికి, చెముడులంక, బడుగువానిలంక, చొప్పెల్ల తదితర గ్రామాలకు సంబంధించి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకూ సరఫరా నిలిపివేయనున్నామన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చూడండి

సఖినేటిపల్లి: మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని మానవ హక్కుల వేదిక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సభ్యులు చెవ్వాకుల వెంకట్, ముత్యాల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం అంతర్వేదికర శివారు దిండకొడపలో సముద్రం అలలు సమీపంలో ఇసుక తవ్వకాలపై పరిశీలన చేశారు. వారు మాట్లాడుతూ, ఇసుకను తవ్వేసిన ప్రాంతాలను రెవెన్యూ యంత్రాంగం విచారణ చేసి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఉపాధి హామీ పథకం నిధులతో ఉప్పునీరు గ్రామాల్లోకి పోటెత్తకుండా తీరంలో రక్షణ గట్లు అంతర్వేది దేవస్థానం నుంచి గొల్లపాలెం వరకూ వేశారన్నారు. కొంత మంది రక్షణ గట్ల పేరుతో సముద్రం అలలు వచ్చే చోట ఇసుకను తవ్వేసి అమ్మకాలు జరుపుతున్నారని ఆరోపించారు. ఇటీవల అంతర్వేదికరలో తవ్వకాలపై రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్టుగా తమకు సమాచారం ఉందన్నారు.

నేటి నుంచి ప్రవచన మహోత్సవాలు

అంబాజీపేట: గ్రామంలోని పెద్దవీధిలో ఉన్న ఏవీఆర్ గ్రాండ్ ఏసీ కల్యాణ మండపంలో ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు మహాభారతం ప్రవచన మహోత్సవాలను నిర్వహించనున్నట్లు అప్పన రవి కుమార్, రేవతి దంపతులు తెలిపారు. ఈ ప్రవచనాలను శ్రీనివాస రామానుజదాసుతో గావిస్తారన్నారు. ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రవచనాలు జరుగుతాయన్నారు. భక్తులంతా విచ్చేసి ప్రవచానాలను గావించాలని కోరారు.

విద్యుత్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేయాలి



రాజోలు బస్టాండ్ గేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రాజోలు: విద్యుత్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసి నిర్వహించాలని కోరుతూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వెల్ఫేర్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో శనివారం రాజోలులో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు రాజోలు ఆర్టీసీ బస్టాండ్ వద్ద యూనియన్ నాయకులు గేట్ మీటింగ్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణల పేరుతో విద్యుత్ బస్సులను ప్రైవేటు వ్యక్తులకు కేటాయిస్తున్నాయన్నారు. బస్సుల కొనుగోలు ద్వారా వచ్చే సబ్సిడీ ప్రైవేటు వ్యక్తులకే పోతుందన్నారు. అలా కాకుండా ఆర్టీసీ విద్యుత్ బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ వ్యక్తులు సంస్థలోకి చొరబడితే భవిష్యత్‌లో సంస్థకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. దీనికి సంబంధించిన జీఓ 88ను తక్షణమే ఉపసంహరించాలని కోరారు. అధ్యక్షుడు నారాయణ, ఎస్‌కేఏ ఖలీల్, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

రాజోలు: శివకోటి గ్రామానికి చెందిన దొంగ సాయి కిరణ్ వినూత్నంగా తన కుమార్తె లిషిక పుట్టినరోజున విందు, కేక్ కటింగ్‌లు, ఆర్భాటాలకు వెళ్లకుండా గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆ శిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రారంభించారు. స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి సుమారు 200 మందికి కంటి, షుగర్, బీపీ, ఈసీజీ, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా రామారావు, డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాసరావు, ఎంపీపీ కడలి శ్రీదుర్గ, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతకు సత్కారం



సఖినేటిపల్లిలంకలో ప్రభావతి దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

సఖినేటిపల్లి: మండలంలోని సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్, రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డు గ్రహీత గుండేపల్లి ప్రభావతి దంపతులకు శనివారం ప్రముఖులు, విద్యాశాఖాధికారులు ఘనంగా సత్కరించారు. సదరు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్కారం ఏర్పాటు చేశారు. ఎంఈవో-1, 2 కిషోర్ కుమార్, మద్దాలి వెంకటేశ్వరరావు, రేపూరి ఏసు నరసింహా రాజా, కాంప్లెక్స్ హెచ్ఎం కే.వీరా స్వామి, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వృద్ధుడిని రక్షించిన పోలీసులు



సత్యనారాయణను పడవల సాయంతో ఒడ్డుకు చేర్చిన పోలీసులు, జాలర్లు

ఆలమూరు: జాతీయ రహదారిలోని ఆలమూరు గౌతమీ గోదావరి వృద్ధ వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడబోతున్న కుంపట్ల సత్యనారాయణ (65)ను స్థానిక పోలీసులు రక్షించారు. వివరాల్లోకి వెళితే.. 2023 బ్యాచ్‌కు చెందిన ప్రొబేషనరీ ఉమెన్స్ డీఎస్పీ పి.ప్రదీప్తి తన వాహనంలో రాజమహేంద్రవరం వైపు వెళుతున్నారు. అంతలో రెయిలింగ్ ఎక్కి వంతెనపై నుంచి దూకుతున్న వ్యక్తిని గమనించిన ఆమె సత్వరమే సమీప ఎస్సై నరేష్‌కు సమాచారం అందించారు. స్పందించిన ఆయన జొన్నాడలో ఉన్న కానిస్టేబుల్ పలివెల రాజు, హోంగార్డు సాయి సంఘటనా స్థలానికి చేరుకుని జాలర్ల సాయంతో పడవలో వెళ్లి ఆయనను రక్షించి జొన్నాడ ఒడ్డుకు చేర్చారు. అతడిని ప్రదీప్తి తన కారులో ఎక్కించుకొని ఆలమూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్సను అందించారు.

ప్రదీప్తికి అభినందనల వెల్లువ

ఆత్మహత్యా సంఘటనను చూసి చలించిపోయిన ప్రదీప్తి పట్ల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మానవత్వంతో సాటి మనిషిని సహచర పోలీసుల సాయంతో రక్షించి మెరుగైన చికిత్సను అందించేందుకు తోడ్పాటును అందించిన ఆమెను ఎస్పీ బి.కృష్ణారావు, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ అభినందించారు.

అలజడి రేకెత్తించిన కెరటాల ఉధృతి



రేవులో అలజడి రేకెత్తించిన పంటు ప్రయాణం

సఖినేటిపల్లి: నర్సాపురం- సఖినేటిపల్లి రేవులో శనివారం గోదావరి కెరటాల ఉధృతి పంటు ప్రయాణికులకు అలజడి రేకెత్తించాయి. సఖినేటిపల్లి రేవు నుంచి ప్రయాణికులతో బయలుదేరిన పంటు నర్సాపురం వైపునకు వెళ్లే క్రమంలో అలల ఉధృతి పెరిగింది. పెరిగిన కెరటాల ధాటికి పంటు అటు, ఇటు సయ్యాటలాడడం మొదలు పెట్టింది. ఇలానే అటు వైపు రేవుకు చేరే వరకూ కొనసాగడం వారిలో భయాందోళనను రేకెత్తించింది. రేవుకు చేరుకొని వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

లోక్ అదాలత్‌తో 136 కేసుల పరిష్కారం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ప్రమీలారాణి

రాజోలు: జాతీయ లోక్ అదాలత్ ద్వారా రాజోలు కోర్టు కాంప్లెక్స్‌లో శనివారం 136 కేసులు పరిష్కరించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు ఆధ్వర్యంలో కేసులను పరిష్కరించారు. 136 కేసుల ద్వారా రూ.61.92 లక్షల ఆర్థిక లావాదేవీలకు విముక్తి లభించింది. న్యాయ అవగాహన సదస్సులో ప్రమీలారాణి మాట్లాడుతూ, రాజీయే రాజమార్గం అనే సిద్ధాంతంతో లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న అనేక కేసులు పరిష్కారమవుతున్నాయన్నారు. లోక్ అదాలత్ సభ్యులు దివి శ్రీనివాస్, వై.లక్ష్మి సుధ తదితరులు పాల్గొన్నారు.

117 కేసులు పరిష్కారం

ఆలమూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 117 కేసులు పరిష్కారమయ్యాయి. జడ్జి ఇంటూరి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో న్యాయ సేవా సంస్థ బృందం ఈ కేసులు పరిష్కరించడం ద్వారా అపరాధ రుసుం రూ 35.18 లక్షలు కక్షిదారులకు సమకూరినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. బెంచ్ మెంబర్, కెవివి.సాయిరామ్, ఆలమూరు, అంగర, మండపేట టౌన్, మండపేట రూరల్‌కు చెందిన పోలీసులు పాల్గొన్నారు.

భార్యపై కోపంతో విద్యుత్ టవర్ ఎక్కిన భర్త



విద్యుత్ టవర్ ఎక్కిన సాయిబాబు

పి.గన్నవరం: భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందన్న కోపంతో భర్త విద్యుత్ హైటెన్షన్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన సంఘటన శనివారం పి.గన్నవరం అక్విడెక్టు వద్ద జరిగింది. స్థానికులు, పోలీసులు అతనికి నచ్చజెప్పి కిందికి దించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎల్.గన్నవరం శివారు జొన్నల్లంకకి చెందిన పెసంగి సాయిబాబు (48) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి భార్య గంగా భవానీ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొంత కాలంగా భార్య, భర్తల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. దీంతో భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో సాయిబాబు శనివారం మధ్యాహ్నం పాత అక్విడెక్టు వద్ద ఉన్న విద్యుత్ టవర్ ఎక్కడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఏఎస్సై పట్టాభిరామయ్య, వీఆర్వో కోరుకొండ శ్రీను, అతడి బంధువులు అక్కడికి చేరుకున్నారు. టవర్‌పై ఉన్న సాయిబాబుకు వారు నచ్చజెప్పారు. కష్టపడుతున్నా భార్య తనకు విలువ ఇవ్వట్లేదని, పుట్టింటి వారికే ప్రాధాన్యత ఇస్తుండటంతో టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నట్టు తెలిపాడు. అతడిని స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

కవనగీష్పతి పురస్కారం అందుకున్న 'దేవరకొండ'



పురస్కారంతో రమణారావును సత్కరిస్తున్న దృశ్యం

రాజోలు: రాయలసీమ రంగస్థలి 35వ వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ ద్వారా రాజోలుకు చెందిన కవి దేవరకొండ శ్రీనివాస వెంకట రమణారావు కవనగీష్పతి పురస్కారాన్ని అందుకున్నారు. ఈ నెల 12న తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా చైర్మన్ సి.దివాకర్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న వెంకటరమణారావు శివకోటి ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పదవీ విరమణ వయసు పెంచాలి

ఆలమూరు: దీర్ఘకాలికంగా జిల్లా సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకట రామయ్య అన్నారు. ఆలమూరులోని పీఏసీఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన జిల్లా సర్వసభ్య సమావేశానికి జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు అధ్యక్షత వహించగా.. రాష్ట్ర వెంకట రామయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీవో నంబర్ 36 ప్రకారం ఉద్యోగుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సహకార సంఘాల ఉద్యోగులకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు నూకల బలరాం వ్యాఖ్యానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె సత్యనారాయణ, కోశాధికారి బొబ్బా రామసుబ్రహ్మణ్యం చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

పి.గన్నవరం: పోతవరంలోని ధనవర్ష సహాయ సహకార పొదుపు సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ఇస్తున్నట్టు సంఘ చైర్మన్ కంకిపాటి ప్రసాద్ తెలిపారు. తాటికాయలవారిపాలెంలోని ధనవర్ష పంక్షన్ హాలులో శనివారం సంఘం 26వ సర్వసభ్య సమావేశం జరిగింది. సంఘ సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు సైతం ఉచిత శిక్షణ ఇస్తున్నామని ప్రసాద్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజనల్ ప్రెసిడెంట్ కె.సత్యనారాయణ మూర్తి, ట్రెజరీ మేనేజర్ బాల దుర్గాప్రసాద్, సంఘ ఆడిటర్లు, డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి



తాడి నాగమోహన్ రెడ్డి (ఫైల్)

ఆలమూరు: మండలంలోని జొన్నాడకు చెందిన వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎంపీటీసీ తాడి నాగమోహన్‌రెడ్డి (60) మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ఆయన ఆరోగ్యం మరింత క్షీణించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందారు. 2006-2011 మధ్య ఆయన గ్రామ ఎంపీటీసీగా పనిచేశారు. మృతుడు నాగమోహన్‌రెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్‌రెడ్డి సంతాపం తెలిపారు.

ఫిర్యాదులపై విచారణ

పి.గన్నవరం: సీహెచ్‌సీలో రోగులకు ఎనస్థీషియన్ అందుబాటులో ఉండటం లేదంటూ వచ్చిన ఫిర్యాదులపై శనివారం రామచంద్రాపురం ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ప్రవీణ్ విచారణ నిర్వహించారు. ఇక్కడ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న మత్తు వైద్య నిపుణురాలు సాయి మాధురి ఆస్పత్రికి వచ్చిన ప్రజలతో సరిగా మాట్లాడటం లేదని, విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కూడా ఉన్నతాధికారులతో మాట్లాడారు. డీసీహెచ్ఎస్ కార్తీక్ సోకాజ్ నోటీసు ఇచ్చినా ఆమె సమాధానం ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రి వైద్య సిబ్బందిని, ప్రజలను, ప్రజాప్రతినిధులను వేర్వేరుగా విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం తన నివేదికను కొవ్వూరు డీసీహెచ్ఎస్‌కు సమర్పిస్తానని విచారణ అధికారి ప్రవీణ్ విలేకరులకు తెలిపారు.

చిట్టిబాబు కుటుంబ సభ్యులకు సూర్యారావు పరామర్శ



చిట్టిబాబు కుటుంబీకులను పరామర్శిస్తున్న సూర్యారావు

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు యెనుముల చిట్టిబాబు కుటుంబ సభ్యులను శనివారం ఆ పార్టీ రాజోలు ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. చిట్టిబాబు మృతి పట్ల గొల్లపల్లి సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట నాయకులు రుద్రరాజు చినరాజా, కుసుమ చంద్రశేఖర్, తాడి సహదేవ్, ఈద రవి రెడ్డి, పలువురు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉన్నారు.

కిల్కారి యాప్‌తో ఉన్నత వైద్యసేవలు

అయినవిల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అర్మన్ కిల్కారి యాప్ ద్వారా గర్భిణులకు, బాలింతలకు ఉన్నత వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తునట్లు కిల్కారి యాప్‌కు చెందిన ఢిల్లీ సెంటర్ బృందం అర్గనైజర్ అమిత్‌భూషన్ తెలిపారు. శనివారం వీరూ అయినవిల్లి పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి మంగాదేవి ఆధ్వర్యంలో అమిత్‌భూషన్, రవికిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం క్షేత్రస్థాయిలో గర్భిణులను, బాలింతలను కలిసి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కిల్కారి యాప్ ద్వారా తీసుకోవాల్సి జాగ్రత్తలను వైద్య నిపుణులు వివరిస్తారని చెప్పారు. కిల్కారి యాప్ ద్వారా కాల్స్ చేసి తల్లీబిడ్డల ఆరోగ్య సమాచారం వైద్య నిపుణులు తెలుసుకుంటారన్నారు. అలాగే కిల్కారి కాల్ ఈ నంబర్ 911600103660 నుంచి వస్తాయన్నారు. వైద్యులు సంతోష్, ఎంఎల్‌హెచ్‌పీ సుధాకర్, కిల్కారి పీఓ రాజు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో శనివారం వేజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక నాయకుడు తోటకూర సుబ్బరాజు సంయుక్త ఆధ్వర్యంలో రాజమహేంద్రవరానికి చెందిన మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గౌతమి నేత్రాలయం, శ్రీరామా దంత వైద్య శాఖ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, ఎముకలు, కంటి, దంత పరీక్షలు వంటివి ఆయా విభాగాల వైద్యులు గురుకుమార్, డాక్టర్ పవన్, వై.రాంబాబు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 20 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసి, 10 మందిని కంటి ఆపరేషన్‌కు తీసుకెళ్లారు.

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు

పి.గన్నవరం: గ్రామంలోని పీఎంశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 17, 18, 19 తేదీల్లో మండల స్థాయిలో ఎస్‌జీఎఫ్ పోటీలు, డివిజన్ స్థాయి టీమ్‌లకు ఎంపికలు నిర్వహిస్తున్నట్టు ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రానందం తెలిపారు. పి.గన్నవరం ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం కోసూరి ఉమాదేవిని మండల ఆర్గనైజింగ్ కన్వీనర్‌గా నియమించారు. నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ కేవీ రమణ, మండల స్పోర్ట్ కోఆర్డినేటర్ ఎం.దుర్గాప్రసాద్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, పీఈటీలు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో ఉన్న అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి తోమల సేవ, అర్చన, నైవేద్యం వంటి విశేష పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

శనైశ్వరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్వర) స్వామిని శనివారం భక్తులు దర్శించి, తైలాభిషేకాలు జరిపించారు. తైలాభిషేకాల టిక్కెట్లు ద్వారా దేవస్థానానికి రూ.1,50,175, అన్న ప్రసాద విరాళాల రూపంలో రూ.37,491తో మొత్తం రూ.1,87,666 ఆదాయం వచ్చినట్టు ఈఓ సురేష్‌బాబు తెలిపారు.